జిల్లాలో 1144 .2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. సోమవారం రాత్రి అన్ని మండలాలలో కురిసిన వర్షానికి 1144.2 శాతం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ గణాంకాల అధికారి తెలిపారు. అత్యధికంగా అమడగూరు మండలంలో 99.0 మిల్లీమీటర్లు, కదిరిలో 87.2, రొళ్లలో 73.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అతి తక్కువగా తాడిమర్రిలో 3.8, సికె పల్లి లో 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగతా మండలంలో ఒక మోస్తారు వర్షం కురిసింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పది మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేరుశనగ పంటకు అదురు దాటి వర్షాలు కురిసినందున ఎలాంటి ఉపయోగం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఈ వర్షాలకు కంది, అలసంద, పెసరు, ఉలవ తదితర పంటలు పెట్టుకోవచ్చని చెబుతున్నారు. అయితే ఈ వర్షాల వల్ల బోరులలో నీటిమట్టం పెరుగుతుందంటున్నారు.

అనర్హులకు సబ్సిడీ రుణం

నిరుద్యోగ యువతకు మొండిచేయి
అనర్హులకు వెలుగు, బ్యాంక్ ఉద్యోగుల సహకారం
రుణాలు తీసుకోవడం... దుకాణాలు మూసేయడం..!

సబ్సిడీ రుణం తీసుకున్న తరువాత మూసివేసిన దుకాణం

ప్రజాశక్తి-లేపాక్షి

కేంద్ర ప్రభుత్వం సామాన్యులు, నిరుద్యోగుల కోసం సబ్సిడీ రుణాల మంజూరు చేయాలని పిఎంఇజిపి అనే పథకాన్ని తెచ్చింది. ఇందులో భాగంగా నిరుద్యోగులకు సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేస్తోంది. ఈ ప్రక్రియను కొనసాగించేందుకు వెలుగు, బ్యాంకులకు అనుసంధానం చేశారు. కాగా ఈ రుణాలు పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అర్హులు దరఖాస్తు చేసుకున్నా కాదని, సిఫార్సు, లంచం ఇచ్చే వారికి సబ్సిడీ సాయం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లేపాక్షి మండల కేంద్రంలో ఉన్న వెలుగు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు, నిరుద్యోగులకు కనీస అవగాహన కల్పిస్తున్న దాఖలాలు లేవు. సబ్సిడీ రుణాలను ఆ శాఖ పరిధిలోని సిబ్బంది బంధువులు, తెలిసిన వారికే మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఒక సంవత్సరానికి 250మందికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాల్సుంది. గత ఐదు సంవత్సరాల్లో సబ్సిడీ రుణాలపై అవగాహన కల్పించకుండా వారికి కావాల్సిన వారికి మాత్రమే రుణాలు ఇచ్చేశారు. నిరుద్యోగులు రుణాలు పొందాలంటే అనేక కారణాలు చెప్పి వారికి రాకుండా అడ్డుపడుతున్నారు. జిల్లా అధికారులు మాత్రం సంవత్సర లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. రుణాలను అర్హులకు అందించి లక్ష్యాన్ని చేరుకోవాల్సిన స్థానిక వెలుగు అధికారులు అనర్హులకు రుణాలు ఇచ్చి ఈ పథకం లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. లేపాక్షి వెలుగు కార్యాలయంలో పనిచేసే ఒక మండల స్థాయి ఉద్యోగి ఆయనకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించి లాభపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
లేపాక్షి మండల కేంద్రంలో ఒక బేకరీకి కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీ రుణం మంజూరు చేశారు. ఈ రుణం తీసుకునే వ్యక్తి అర్హుడా.. కాదా అన్న విషయాన్ని ఆ బ్యాంక్ మేనేజర్, వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఎపిఎం విచారణ చేయకుండానే పిఎంఈజేపి పథకం కింద రూ.5లక్షలు సబ్సిడీ రుణం మంజూరుచేశారు. ఈ బేకరి షాపు నిర్వాహుడు ఆర్థికంగా బాగా ఉన్న వ్యక్తి. అయినా ఆయనకు మళ్లీ సబ్సిడీ రుణాన్ని ఇచ్చారు. సామాన్య నిరుద్యోగులు రుణం కావాలని వెలుగు అధికారులు, బ్యాంకు సిబ్బందిని కలిస్తే సవాలక్ష నిబంధనలు చెప్పి అడ్డుపడుతున్నారు.

లేపాక్షి వెలుగు కార్యాలయం

సబ్సిడీ రుణం రాగానే దుకాణం బంద్..

లేపాక్షి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఒక దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడ గతంలో ఓషాపుకు సబ్సిడీ రుణం ఇచ్చారు. మళ్లీ అదే షాపును చెరుకు రసం అమ్మే దుకాణంగా మార్చి పిఎంఇజిపి పథకంతో సబ్సిడీ రుణం కింద సుమారు రూ.5లక్షల రుణం ఇచ్చారు. రుణం తీసుకునే కొన్ని రోజులు దుకాణం తెరిచారు. రుణం మంజూరు కాగానే దుకాణం బంద్ చేసి వెళ్లిపోయారు. కొండూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సబ్సిడీ రుణం కింద ఓ బ్యాంక్‌లో అప్పటి మేనేజర్‌తో మాటామంతి చేసి వెలుగు కార్యాలయం అనుసంధానంతో కేంద్ర ప్రభుత్వం నుంచి 35 శాతం సబ్సిడీతో రూ.ఐదు లక్షల రుణాన్ని తీసుకున్నాడు. ఈ వ్యక్తి వెలుగు కార్యాలయంలో పనిచేసే ప్రముఖ ఉద్యోగి బంధువు అని తెలిసింది. ఆ అభిమానంతోనే సదరు అధికారి రుణం మంజూరు చేశారు.

కేంద్ర పథకాలపై అవగాహన శూన్యం

నిరుద్యోగుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న సబ్సిడీ రుణాలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని తెలుస్తోంది. అవగాహన కల్పిస్తే అందరికీ సబ్సిడీ రుణాలు వెళ్తాయని కోణంతో వారికి కావాల్సిన వారికి రుణాలు ఇచ్చేందుకు పక్కాగా ప్లాన్ చేసుకుని సంబంధిత అధికారులు ఏపీఎం, యానిమినేటర్లు ఎవరూ కూడా అవగాహన కల్పించలేదు. నెలనెలా జరిగే మహిళా సంఘాల మహిళలకు సబ్సిడీ రుణాలపై కనీస అవగాహన కూడా కల్పించడం లేదు. కావాలనే వెలుగు అధికారులు ఇలా చేస్తున్నారా.. లేక మరే కారణం అయినా ఉందానే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

ముగ్గురికే రుణాలు ఇచ్చాం

గత సంవత్సరంలో 250 సబ్సిడీ రుణాలకు గాను ముగ్గురికి మాత్రమే ఇచ్చాం. అర్హులకు రుణాలు ఇచ్చేలా తమ శాఖ ద్వారా కృషి చేస్తున్నాం. నిబంధనల మేరకే ఎంపిక జరుగుతోంది.

జయచంద్ర,
ఎపిఎం

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, తదితరులు

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడారు. పోలీసులకు అందించిన సమాచారం మేరకు ఈనెల 20న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మండలంలోని గుమ్మయగారిపల్లి క్రాస్ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న గోరంట్ల మండలానికి చెందిన వ్యక్తులను గుర్తించామన్నారు. గోరంట్లలోని జామియా మసీదు ప్రాంతానికి చెందిన షేక్ అప్రోచ్, మొహమ్మద్, మహమ్మద్ రిజ్వాన్ ఖాన్, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ వద్దనుండి 2.80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు అక్రమ సంపాదనకు అలవాటు పడి గంజాయి సేకరించి గోరంట్ల చుట్టుపక్కల వారికి తక్కువ మోతాదులో ఎక్కువ ధరకి గంజాయి విక్రయించేవారన్కానరు. ఈ ముఠా గురించి గోరంట్ల సిఐ శేఖర్ కు సమాచారం రావడంతో సిబ్బందితో గుమ్మగారిపల్లి క్రాస్ సమీపంలో కొంతమంది వ్యక్తులు గుమి కూడి ఉండగా పోలీసులు దాడి చేయగా కొంతమంది పారిపోయన్నారు. వీరిలో నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి విక్రయ గుట్టు రట్టయిందన్నారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు అరెస్ట్ చేసినవారిని రిమాండ్ పంపుతున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

మేకల కాపరి దారుణ హత్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలం మలుగూరు గ్రామ పొలాల్లో మేకల కాపరి దారుణ హత్యకు గురయింది. జయమ్మ అనే మేకల కాపరి గొంతు నులిమి చంపేసి, 20 మేకలను ఎత్తుకెళ్లారు. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు... సోమవారం ఉదయం జయమ్మ తన మేకలను మేపడానికి వెళ్లింది.గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను వెంబడించి దారుణ హత్య చేసి మేకలను ఎత్తుకెళ్లాడు. జయమ్మ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. మంగళవారం ఉదయం గ్రామ పొలంలో శవమై కనిపించింది. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దారుణ సంఘటన ఎలా జరిగింది..? ఎవరు పాల్పడ్డారన్న వివరాలు పోలీసు దర్యాప్తులో వెల్లడి కావాల్సుంది.

హిందూపురం జోన్ ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షులుగా పాంచజన్య శ్రీనివాసులు

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న పాఠశాలల కరస్పాండెంట్లు

ప్రజాశక్తి- హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం జోన్ ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షులుగా పాంచజన్య శ్రీనివాసులను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పిఎస్. శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులుగా ముస్తఫా, కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా ఎస్ .రియాజ్, ఉపాధ్యక్షులుగా దీపు, సంయుక్త కోశాధికారిగా నందా, ఉమ్మడి కార్యదర్శిగా పిఎం. రియాజ్, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, జయంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

'పురం' మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజీనామా

ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్
పురపాలికలో పాగా వేయనున్న టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇంద్రజ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆమె రాజీనామాను ఆమోదిస్తున్నట్లు కౌన్సిల్ సభ్యులు చేతులెత్తి తమ ఆమోదాన్ని తెలియజేశారు. హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 30 మంది వైసిపి, ఆరుగురు టిడిపి, ఒక బిజెపి, ఒక ఎంఐఎం సభ్యుడు ఉన్నారు. మూడున్నర సంవత్సరాల పాటు ఇంద్రజ ఛైర్ పర్సన్ గా ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికల అనంతరం ఎంఐఎం కౌన్సిలర్ తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈనేపథ్యంలో ఇటీవల ఛైర్‌పర్సన్ తో పాటు 10 మంది వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో తెలుగుదేశం పార్టీ బలం పెరిగింది. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్‌లో ఇటీవల టిడిపి లోకి చేరిన వైసిపి కౌన్సిలర్లతో పాటు కూటమి బిజెపి కౌన్సిలర్ మద్దతు ఉండడంతో కౌన్సిల్‌లో తెలుగుదేశం పార్టీ పాగా వేసేందుకు మార్గం సులువైంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 6వ వార్డ్ కౌన్సిలర్ డిఇ. రమేష్ కుమార్ మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నిక కావడానికి లైన్ క్లియర్ అయినట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో తెలుగుదేశం బలంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో ఆ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉండడంతో డిఇ రమేష్ కుమార్ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం లాంఛన ప్రాయమే. ఇదిలా ఉండగా తాను వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఇంద్రజ సర్వసభ్య సమావేశంలో పేర్కొని అదే విషయాన్ని మున్సిపల్ మినిట్ పుస్తకంలో కూడా నమోదు చేశారు. ఇకపోతే ఇటీవల తెలుగుదేశం పార్టీలోకి చేరిన వైసిపి కౌన్సిలర్లతో పాటు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు మంగళవారం సాయంత్రం విజయవాడకు బయలుదేరినట్లు సమాచారం. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఇటీవల జరిగిన పరిణామాలలో వివరించనున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా నూతన ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీలో పాగా వేయాలన్న ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది.

'ఉపాధి' సదస్సులను జయప్రదం చేయండి

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తం గా జరిగే ఉపాధి హామీ సదస్సుల్లో కూలీలు పాల్గొని విజయవంతం చేయా లని సిపిఎం నాయకు లు కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయం లో మంగళ వారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏడాది లో 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ. 500 వేతనం, పని ప్రదేశం వద్ద కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, సిఐటియు నాయకులు వెంకటేష్, సిపిఎం ఆఫీస్ కార్యదర్శి సిద్దు, పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు బంద్

పుట్టపర్తి అర్బన్ : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగే బందును విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులను, ఆర్టీసీ బస్సులు నడపరాదని డిపో మేనేజర్ కు విన్నవించమన్నారు. వాణిజ్య వర్తక, కిరాణా షాపులు స్వచ్ఛందంగా మూసివేయాలని కోరారు.

'శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

కదిరి టౌన్ : నిబంధనలు పాటించని కదిరి పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు అజయ్, ఉపేంద్ర డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నో, ఈ టెక్నో, నీట్, ఐఐటి పేరుతో విద్యార్థుల తల్లితండ్రుల నుండి నర్సరీకి రూ. 25 వేలు నుండి మొదలు పెట్టి పై తరగతులకు 30, 35 వేలు రూపాయల ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. బస్సు ఫీజులు అంటూ రూ. 15 వేలు నుండి 20 వేలు రూపాయల వరకు వసూలు చేసి విద్యార్థులను బస్సుల్లో నిల్చొని వెళ్ళాల్సిన దుస్థితి తెచ్చారని విమర్శించారు. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులకు కనీస విద్యార్హత లేకుండా విద్యా బోధన చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నింటీనీ ఎంఇఒ చిన్నికృష్ణ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఉలిక్కిపడ్డ తాడిపత్రి

- ◆ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై దాడికి టిడిపి శ్రేణులు యత్నం
- ◆ వైసిపి నాయకులు కందిగోపుల మురళి ఇంటిపైనా దాడి
- ◆ ఇంటికి నిప్పు, వాహనాలు ధ్వంసం
- ◆ వైసిపి కార్యకర్త అడ్డు రఫీపై దాడి ... తీవ్ర గాయాలు
- ◆ రంగంలోకి పోలీసు బలగాలు

వివాదాలకు కేంద్రంగా మారిన తాడిపత్రిలో మంగళవారం సాయంత్రం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పట్టణంలోకి వచ్చాడని తెలుసుకున్న టిడిపికి చెందిన కొందరు పట్టణంలో అలజడి సృష్టించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పాల్పడ్డారు. వైసిపి నాయకులు కందిగోపుల మురళి ఇంటికి నిప్పంటించారు. అతనికి చెందిన వాహనాలను ధ్వంసం చేశారు. వైసిపి కార్యకర్త అడ్డు రఫీపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి పంపించివేశారు.

దాడిలో ధ్వంసమైన కందిగోపుల మురళికి చెందిన వాహనాలు

ప్రజాశక్తి - తాడిపత్రి

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణంలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నాయకుడు కందిగోపుల మురళి వాహనాలను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పు పెట్టారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై కూడా జెసి ప్రభాకర్ రెడ్డి అనుచరులుగా భావిస్తున్న గుంపు దాడికి పాల్పడింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణంలోకి ప్రవేశించరాదని ఆంక్షలు ఉన్నప్పటికీ ఆయన వచ్చారంటూ తెలుసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు చేరుకునేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. వైసీపీ నేత కందిగోపుల మురళి ఇల్లు దాదాపు అగ్నికి ఆహుతి అయింది. ప్రస్తుతం పోలీసులు బలగాలు రంగంలోకి దిగాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రికి వస్తున్న నేపథ్యంలో పోలీసులు కొండాపురం వద్ద ఆయనను అడ్డుకున్నారు. కానీ తాడిపత్రిలోని తమ ఇంటి వద్ద పని ముగించుకుని తిరిగి వెళ్తానని పోలీసులతో చర్చించి తాడిపత్రికి వస్తున్న సమాచారాన్ని టిడిపి వర్గీల అంతర్గత గ్రూపులలో చక్కర్లుకొట్టడంతో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు పోగయ్యారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని తాడిపత్రిలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్త అడ్డు రఫీకి రక్త గాయాలయ్యాయి. పోలీసులు టీడీపీ కార్యకర్తలను నియంత్రిస్తూ అటు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రి నుండి పంపించారు. ఈ దశలో టిడిపి కార్యకర్తలు వైసీపీ నాయకులు మురళి ఇంటిపై దాడి చేశారు. మురళి ఇంటికి నిప్పు పెట్టి ఆయన సంబంధించిన ఇన్నోవా, ఒక కారు, ఒక స్కూటీని ధ్వంసం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసుల ఇంట్లోనే ఉన్న మురళిని రక్షణ కల్పించారు. సమస్య తీవ్ర రూపం దాల్చకుండా టిడిపి కార్యకర్తలు చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్ తాడిపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

దాడిలో గాయపడ్డ అడ్డు రఫీ

వక్క మార్కెట్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-అమరాపురం

వక్క మార్కెట్ ఏర్పాటు చేయడానికి మంగళవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మండలంలోని హలుకురు పంచాయతీకి చెందిన ఉదుగూరు గ్రామ సమీపంలో భూమిని పరిశీలించా రు. అక్కడ 25.67 ఎకరాల భూమి ఉండగా మార్కెట్, ప్రాసెసింగ్ సెంటర్ కోసం పదెకరాల భూమిని సేకరించడానికి స్థలాన్ని పరిశీలించారు. అలాగే హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న 8.76 ఎకరాల భూమిని పరిశీలించి రోడ్డు సౌకర్యంపై ఆరా తీశారు. పట్టా భూములు కలిగిన రైతుల పొలాల ద్వారా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు. రికార్డుల పరంగా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెసి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్ మారుతి ప్రకాష్, ఆర్ఐ గిరియప్ప, మండల సర్వేయర్ పద్మ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, టిడిపి నాయకులు ప్రకాష్, రఘు,నాగరాజు, తదితరులు ఉన్నారు.

అమరాపురం మండలంలో వక్క మార్కెట్ కోసం స్థలం పరిశీలిస్తున్న జెసి అభిషేక్‌కుమార్

అర్జీలను సత్వరం పరిష్కరించండి : జెసి

అమరాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి అభిషేక్ కుమార్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే వీఆర్వోలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, 1-బి, తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారుల ను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల న్నారు. జెసి వెంట తహశీల్దార్ మారుతి ప్రకాష్, ఆర్ఐ గిరియప్ప, మండల సర్వేయర్ పద్మ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

గుడిబండ : వివిధ సమస్యలపై ప్రజలు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఇచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తహశీల్దార్ కరుణాకర్, డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్‌రెడ్డిని ఆదేశించారు. జెసి మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది కొరత, తదితర సమస్యలపై తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-మడకశిర

ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని మధుగిరి సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మండల కన్వీనర్లు మంజునాథ్, బాబు, గౌడప్ప, లోకేష్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, జగన్నాథ్, డాక్టర్ రవిశంకర్, శ్రీనివాసరెడ్డి, మైలారప్ప, రవీంద్రప్ప, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథరెడ్డి, గంగాధర్, రాయప్ప, వెంకటేశులు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సోమందేపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హిందూపురం : కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ జమీల్ ఆధ్వర్యంలో రహమత్ పూర్ కూడలి లోని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవుఫ్, యునస్, పీ రుసాబ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఫయాజ్, ఆర్‌టిఐ ప్రెసిడెంట్ సుహెబ్ ఖాన్, రఫీక్, అబూ సయిద్, అబ్దుల్లా, పెరిస్వామి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

వేషధారణలో ఉన్న వారిని అభినందిస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మవరం టౌన్ : శ్రీనివాస కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో మానస నృత్య కళా కేంద్రం గురువు మానస ఆధ్వర్యంలో వారి శిష్య బృందం చేసిన నాటకం, నృత్యం ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా మంత్రి సత్యకుమార్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరై మానసతో పాటు శిష్య బృందాన్ని అభినందించి బహుమతులు అందజేశారు. వెంకటేశ్వరస్వామి అలంకరణలో గురువు మానస వేషధారణ ఆకట్టుకుంది.

పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవడానికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. వారు మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ సమీపంలోని చీపిలేటిలో సెప్టెంబర్ 2వ తేదీ గార్మెంట్స్ పరిశ్రమను ప్రారంభిస్తామన్నారు. అందులో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ఆర్.అనంతపురం సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి సిఎం చంద్రబాబు అవకాశాలు కల్పించారన్నారు. సిఎం హామీ మేరకు జిల్లా అధికారులు ఈ నెల 22వ తేదీ ఓబుళమ్మకు గృహ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

అసైన్డ్ భూముల పరిశీలన

ఓబుళదేవరచెరువు : మండలంలోని వెంకటాపురం, తిప్పేపల్లి పంచాయతీల్లో ఉన్న ఫ్రీ అసైన్డ్ భూములను మంగళవారం ఆర్‌డిఒ భాగ్య రేఖ పరిశీలించారు. ఫ్రీ అసైన్డ్ భూముల్లో రైతులు ఉన్నారా లేక ఇతరులు ఉన్నారన్న అంశంపై ఆమె విచారణ చేపట్టారు. ఆర్‌డిఒ వెంట డిప్యూటీ తహశీల్దార్ జాకీర్, విఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దోమల వల్ల వ్యాపించే వ్యాధులపై మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో స్థానిక పిహెచ్‌సి డాక్టర్ మునిచంద్రిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు, తదితర వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. ప్రతి కుటుంబం ప్రతి ఫ్రై డే డ్రై డేగా పాటించాలన్నారు. దోమల నివారణ చర్యలను వివరించారు. ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలంటే పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాయామం చేయడం వల్ల శారీరక ఉల్లాసం, మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా జీవించవచ్చున్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్ఎన్ లలితకుమారి, ఎస్‌యుఒ రమణయ్య, సూపర్‌వైజర్ రమణ, ల్యాబ్ టెక్నీషియన్ సునీత, టీబీ హెల్త్ విజిటర్ రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్త అనురాధ, ఆశా కార్యకర్త గులాబ్ జాన్ పాల్గొన్నారు.

దోమల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

శ్రీశైలంకు నూతన సూపర్ లగ్జరీ బస్సు

పుట్టపర్తి క్రైమ్ : శ్రావణమాసం సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నూతన లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనాయతుల్లా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి నుంచి రాత్రి 8:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8:15 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంద న్నారు. శ్రీశైలంలో రాత్రి 8:15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు పుట్టపర్తికి చేరుతుందన్నారు. బస్సులో పుష్ బ్యాక్ సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా, బస్టాండ్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

ఎస్పీని కలిసిన గోరంట్ల సిఐ

పుట్టపర్తి రూరల్: గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ జి.శేఖర్ మంగళవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వి.రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ గోరంట్ల మండలంలో నేరాల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుందని, అంకిత భావంతో పని చేసి వాటిని నియంత్రించాలని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.

పిల్లలను సన్మార్గంలో పెంచాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మొబైల్ ఛాటింగ్, ఆన్‌లైన్ గేమింగ్, తదితర వాటి వల్ల యువత తీవ్రంగా నష్టపోతుందని, వాటి తీవ్రతను తగ్గించడానికి ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలకు ప్రేమానురాగాలు పంచి దగ్గరకు చేర్చుకొని మంచి మార్గం సూచించాలని చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప సూచించారు. పట్టణంలోని శ్రీసత్యసాయి జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా మెప్మా అధికారి రమాదేవి, శిశు గృహం మేనేజర్ సునీత, ఐసిడిఎస్ సోషల్ వర్కర్ వనజాక్షి, ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్ అధ్యక్షుడు అన్సర్‌బాషా, యూత్ అంబాసిడర్ భరత్, కావేరి హాజరై ప్రసంగించారు. కొండప్ప మాట్లాడుతూ సెల్‌ఫోన్ వాడకం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆన్‌లైన్ మోసాలకు ఎందరో బలి అవుతుండగా, కొందరు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. 'యువతీ యువకులకు మొబైల్ వినియోగం, పిల్లల భవిష్యత్తు' అంశంపై చర్చ సాగింది. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కాజీలు, మండలాల్లోని మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కొండప్ప

ఉచిత శిక్షణ, ఉపాధి

బత్తలపల్లి : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సంస్థతో పాటు దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన సంయుక్తంగా 4 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని బత్తలపల్లి భారతి మండల సమాఖ్య ఎపిఎం సుదర్శన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిటైల్ స్టోర్ మేనేజర్ కోర్స్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇస్తారన్నారు. యూనిఫామ్, శిక్షణ మెటీరియల్, భోజన వసతి కల్పిస్తారన్నారు. ఏదైనా డిగ్రీ పాసై 28 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ ఎంపిక జరుగుతుందన్నారు. వివరాల కోసం జాబ్స్ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి, 77021 00238. 9182316114 సంప్రదించాలన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఆటో డ్రైవర్లు వృత్తిని దైవంగా భావించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సురక్షితంగా గమ్యంలో చేర్చాలని పట్టణ సిఐ నారాయణరెడ్డి సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో మంగళవారం సిఐ ఆటో డ్రైవర్లతో స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంఘవిద్రోహ చర్యల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ బాబ్జాన్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న కదిరి టౌన్ సిఐ నారాయణరెడ్డి

గాండ్లపెంట : డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి అని ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిబంధనలను వివరించారు. ఎవరైనా విలువైన వస్తువులు, డబ్బులు మరిచిపోతే పోలీస్ స్టేషన్లో అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు బాబు, లక్ష్మయ్య, శ్రీరాములు, హసేన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రయాణికులు, వాహనాలకు అంతరాయం కలిగిస్తే ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవని ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్ఐ సాయంకాలం స్థానిక కూడలిలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. క్రమ పద్ధతిలో ఆటోలను నిలిపి ప్రయాణికులను తీసుకెళ్లాలని సూచించారు. ఆటోలో నిబంధనల మేరకే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. సౌండ్ బాక్సులు తొలగించాలన్నారు. లైసెన్సు, రికార్డులు కలిగి ఉండాలని, మద్యం తాగి ఆటో నడపవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్ఐ తిరుపాలు, హెడ్ కానిస్టేబుల్ షమీవుల్లా, కానిస్టేబుల్స్ ఆంజనేయులు, పెద్దారెడ్డి, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలోని ప్రయివేట్ స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు మంగళవారం ఏఎస్ఐ రామాంజనేయులు పలు సూచనలు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లే ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. అలాగే రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సిలను తనిఖీ చేసారు. ఏఎస్ఐతో పాటు పోలీసులు ఉన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

పెనుకొండ : 'ఎయిడ్స్ అంటువ్యాధి కాదు.. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దు' అని ఐసిటిసి కౌన్సిలర్ శివజ్యోతి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిటిసి కౌన్సిలర్ ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై వివరించారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు చూడకూడదన్నారు. వ్యాధిగ్రస్తులకు సమాజంలో అందరితో కలిసి జీవించే హక్కు ఉందన్నారు. అనంతరం చికిత్స, మందులు, కండోమ్ ఉపయోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ పిఒలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, జన జాగృతి పియు ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు, శశికళ, హరిత, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ

ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-బత్తలపల్లి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను ఖండిస్తూ మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. ఎటిఎల్ రుక్మాంగద, కౌన్సిలర్ శోభారాణి, మురళి, తదితరులు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ పై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను ఇప్పటివరకూ అరెస్టు చేయకపోవ డం దారుణ మన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందిస్తున్నా ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిటి సిఒలు నాగరాజు, వెంకటేష్, మహిళా సాధికారత ఎస్‌టిఎల్ వెంకటేష్, గంగాధర, సిబిటిలు వీరనారప్ప, వెంకటలక్ష్మి, ఓబుళమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారం నిర్వహించారు. ర్యాలీలో హెల్పింగ్ హాండ్స్, యువ సైన్యం సభ్యులు లడ్డూ బాబ్‌జాన్, ఆరిఫ్, ఆసిఫ్, రహీం, ఇర్షాద్, పిఇటి డు గోపీనాథ్, ఎస్‌విబి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ జయ సింహారెడ్డి, వెలుగు ఎపిఎం రమణప్ప పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని కదిరేపల్లి గ్రామంలో ఎంపియుపి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రవి, అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు శ్రీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కాలేజ్ సర్కిల్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చిలకం మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితు లను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బెస్త శ్రీనివాసులు, రాజారెడ్డి, అడ్డగిరి శ్యాంకుమార్, వెంకటరెడ్డి, సరితాలు దస్తగిరి, బాలక్రిష్ణ, శ్యాముల్ పాల్గొన్నారు.

పెనుకొండలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టిన విద్యార్థినులు

పెనుకొండ టౌన్ : ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుంచి విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఆర్‌డిటి ఎటిఎల్ కృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మనవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కేజీబీవీ విద్యార్థులు, ఎస్‌డిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, సిపిఐ మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : ఆర్‌డిటి ఎటిఎల్ వన్నూరప్ప ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ రమాదేవి, ఆర్‌డిటి సీఈవోలు శ్రీనివాసులు, గంగప్ప, నరసింహులు, ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు నామమాత్రంగా నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఏ ఒక్క ప్రజా ప్రతినిధి ప్రజా సమస్యలపై నోరు మెదపక పోవడం గమనార్హం. కేవలం అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన వివరాలు చదివి వినిపించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం, డ్రెయినేజీ, వైద్య శిబిరాల ఏర్పాటు, తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక వసతులను తదితర అంశాలను ప్రస్తావించలేదు. సమావేశంలో సమస్యలపై చర్చ జరగక పోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కాగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజా ప్రతినిధులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపిపి గీత సూచించారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపిపి రామాంజనేయులు, ఎంపిడిఒ శివశంకరప్ప, తహశీల్దార్ శ్రీధర్, సిడిపిఒ శాంతలక్ష్మి, డాక్టర్ నాగరాజునాయక్, ఎపిఒ శాంతమ్మ, హౌసింగ్ ఎఇ శ్రీనాథ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గీత

చిలమత్తూరు మండల ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

చిలమత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి హాజరయ్యారు. మండల అధ్యక్షుడుగా జగదీష్, కార్యదర్శిగా సాయిరాం, ఉపాధ్యక్షులుగా విజయ్, నవీన్, చరణ్, రోహిత్, సహాయ కార్యదర్శులుగా ఇర్ఫాన్, జగన్, అరవింద్, జగదీష్, 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్య పరిరక్షణ, ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల నియంత్రణకు పనిచేస్తామన్నారు. విద్యార్థుల సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న మెగా అభిమానులు

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి-కదిరి టౌన్

'రక్త దానం చేయండి ప్రాణ దాతలు కండి' అని డాక్టర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజులు సందర్భంగా మంగళవారం పట్టణం లోని ఎన్‌జిఒ హోంలో అఖిల భారత చిరంజీవి యువత, రాష్ట్ర రామ్‌చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వాసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్.హుస్సేన్, బ్లడ్ సెంటర్ ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీవాణి హాజరయ్యారు. అఖిల భారత చిరంజీవి యువత కదిరి నియోజకవర్గ అధ్యక్షులు లక్ష్మణ కుటాల మాట్లాడుతూ చిరంజీవి, పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో కదిరి మెగా అభిమానులు రక్తదానం చేశారన్నారు. శిబిరంలో అఖిల భారత చిరంజీవి యువత, రాష్ట్ర రామ్ చరణ్ యువ శక్తి సభ్యులు, రామ్ చరణ్ యువ ఫౌండేషన్ అధ్యక్షులు మనోహర్, రాజేంద్ర, కార్తీక్, చక్రి, సోము, చక్రధర్, హర్ష, గోపీనాథ్, ముజీబ్, రఘు, వందేమాతరం టీమ్ సభ్యులు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

రజకులు ఐకమత్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా రజకులు ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతా యని ఎపి రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్యదర్శి జనరల్ కమ్మన తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవ స్వామి గుడిలో మంగళవారం కె.ముత్యాలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కమ్మన ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయంపై త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే సమావేశంలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం పట్టణంలో మడివాల మాచి దేవుని విగ్రహం ఏర్పాటు చేసే అంశంపై 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. రజక అభి వృద్ధి సంస్థ జిల్లా కార్యదర్శిగా అగ్రహారం ముత్యాలు, పట్టణ అధ్యక్షులుగా న్యామద్దెల నరసింహులును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో నారాయణస్వామి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల చైర్మన్లు నారాయణ స్వామి, సుబ్రహ్మణ్యం, కార్యదర్శి లింగార్జున, నాయకులు రాధాకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటును అడ్డగించిన సంఘాలు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమాన్ని అసంబద్ధంగా, అప్రజాస్వామికంగా చేస్తున్న తీరును జిల్లా ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పెనుకొండలో మంగళవారం పని సర్దుబాటును ప్రధానోపాధ్యాయ సంఘాల నాయకులు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఎపిటిఎఫ్ అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు, వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. సెక్షన్ పోస్టు ఉన్న పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా చూపించడం, ఉపాధ్యాయుల అబ్జెక్షన్స్‌ను అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. అలాంటప్పుడు జీవో-2 ఎందుకు ఇచ్చారని మండిపడ్డారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శివానగర్‌కు చెందిన విజయలక్ష్మీ(60) అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. విజయలక్ష్మీ కొంతకాలంగా కాళ్ల నొప్పులతో బాధ పడుతోంది. ఆ నొప్పులు భరించలేక సోమవారం సాయంత్రం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు.. విద్యార్థికి గాయాలు

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై స్థానిక పంజాబీ డాబా వద్ద మంగళవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన చిన్నా స్థానికి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బత్తలపల్లికి రావడానికి ఆటో ఎక్కగా ఆ ఆటో కదిరి రోడ్డులోని దొడ్ల పాల డెయిరీ వద్దకు వెళ్లి తిరిగి బత్తలపల్లిలోని కూడలికి రాంగ్ రూటులో వస్తోంది. అదే సమయంలో అనంతపురం నుంచి కదిరి వైపు వెళ్తున్న ఓ కారును ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో చిన్నా తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చిన్నాను అనంతపురం తరలించారు.

గాలికుంటు నివారణ టీకా వేయించండి

బత్తలపల్లి : పశువుల్లో గాలికుంటు వ్యాధి వ్యాపించకుండా ముందస్తుగా టీకా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ గుర్నాథ్‌రెడ్డి పాడి రైతులకు సూచించారు. స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం వారు మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నివారణ పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా పశువులకు ముందు జాగ్రత్తగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడిరైతులు అపోహలు వీడి పశువులకు టీకా ఉచితంగా వేయించుకోవాలని సూచించారు.

'ఆడపిల్లలను రక్షిద్దాం-చదివిద్దాం'

పెనుకొండ: 'ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం' అని టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఉర్దూ జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'బేటి బచావో-బేటి పడావో' కార్యక్రమం నిర్వహించారు. బాలికల హక్కులు, డ్రగ్స్, బాల్య వివాహాల నిర్మూలన, తది తర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, రిజర్వేషన్ల గురించి తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ శాంతలక్ష్మి, హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, నాయకులు వలిపీరా, షఫీక్, షమూన్, నజీర్, వాజిద్, బర్కత్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి 'పల్లె'కు సన్మానం

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇందుకూరి పల్లి ఉత్తన్న ఆధ్వర్యంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘూనాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. వడ్డెర సంఘం నాయకులు పలు సమస్యలను పల్లె దృష్టికి తీసుకురాగా త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి, నాయకులు గంగులప్ప, మారెప్ప, గంగరాజు, శ్రీరాములు, వెంకటపతి, లక్ష్మీదేవి, రవిశంకర్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


పల్లెను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

పకడ్బందీగా బాలల రక్షణ గృహాల నిర్వహణ : పీడీ

ప్రజాశక్తి - హిందూపురం

బాలల సంరక్షణ గృహాలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీ సత్యసాయి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమల్లేశ్వరి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం గృహ సందర్శన కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ ప్రభుత్వ బాలికల వసతి గృహాలు, శ్రీ సత్య సాయి సేవాసదన్ బాలుర వసతిహోన్ని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, పిల్లలకు అందిస్తున్న భోజన, వసతి సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురంతో పాటు ధర్మవరం, బత్తలపల్లి, పుట్టపర్తిలో కూడా వసతి గృహాలను తమ శాఖ అధికారులు తనిఖీ చేశారన్నారు. తాము పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలో కలెక్టర్, రాష్ట్ర సంబంధిత ప్రభుత్వ శాఖకు అందజేయడం జరుగుతుందన్నారు.